క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నంది గామ మైత్రిప్రియ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో 70 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత కలిగి ఉండి 18 సంవత్సరాల పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు విజయనగర్‌కాలనీలో ఉన్న హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8331854300 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: వాతావరణంలో నెలకొన్న మార్పుల నేపథ్యంలో ప్రజలందరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. శీతాకాలంలో చలి తీవ్రతకు ఇబ్బందులకు గురవుతున్న పేదలకు రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌ఆర్టీ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పేట్లబురుజు ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.. హుస్సేనీఆలం ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు.. మురళీనగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బాక్సింగ్‌కు ఆదరణ పెరుగుతోంది



ఔత్సాహిక బాక్సర్లతో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

గోల్కొండ: బాక్సింగ్ క్రీడకు ఆదరణ పెరుగుతుందని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గోల్కొండ ఒవైసీ కమ్యూనిటీహాల్‌లోని బాక్సింగ్ శిక్షణ శిబిరంలో వివిధ విభాగాల విజేతలకు ఆయన మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ బాక్సింగ్ అసోసియేషన్ ఇప్పటి వరకు ఎందరో యువబాక్సర్లను తీర్చిదిద్దిందన్నారు. బాక్సింగ్ కోచ్ ఘనీచాంద్ మాట్లాడుతూ.. తమ అసోసియేషన్‌కు చెందిన యువ బాక్సర్లు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో పతకాలు సాధించారన్నారు. శిక్షణ కోసం వచ్చే వారి నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయడం లేదన్నారు.

వైభవంగా జియాగూడ మల్లన్న జాతర

- జియాగూడలో ప్రారంభమైన మల్లన్న జాతర
- ప్రతి సంవత్సరం సంక్రాంతికి వైభవంగా ఉత్సవాలు
- వేడుకల్లో భాగంగా 15న మల్లికార్జున స్వామి కల్యాణం

జియాగూడ: జియాగూడలోని చారిత్రాత్మకమైన మల్లన్న ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో భాగంగా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 250 సంవత్సరాల క్రితం జియాగూడ గుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి మల్లన్నగా పూజలందుకుంటున్నాడు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సమయంలో వారం రోజుల పాటు మల్లన్న జాతర నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కొమురవెల్లి మల్లన్న జాతర తరహాలోనే ఇక్కడ జాతర నిర్వహించడం విశేషం.

పుట్ట మన్నుతో విగ్రహాలు..

జియాగూడ మల్లన్న, గొల్లకేతమ్మ, భ్రమరాంబ విగ్రహాలను 250 సంవత్సరాల క్రితం మూసీనది ఒడ్డున పుట్ట మన్ను తీసుకువచ్చి కురుమలు, యాదవులు కలిసి విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించారు. నాటి నుంచి పూజలందుకుంటున్న విగ్రహాలు నేటికీ చెక్కు చెదరలేదు. కేవలం ప్రతి ఏటా ప్లాస్టరాఫ్ ప్యారిస్‌తో రంగులద్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తులు వివిధ కార్యక్రమాలను కొనసాగించి భక్తులను పరశింపజేస్తారు.



మల్లికార్జున స్వామి ఆలయం



కొలువుదీరిన స్వామి వారు

ప్రారంభమైన వేడుకలు..

ఈ నెల 8న ప్రారంభమైన వేడుకల్లో భాగంగా మల్లన్న ఆలయంలో దిష్టికుంభం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఆంజనేయస్వామి ఆకు పూజ, సిందూరం సమర్పణ, మల్లికార్జున స్వామి బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 12న మల్లికార్జున స్వామి సహస్రనామార్చన, 13న భ్రమరాంబ దేవి కుంకుమార్చన, 14న సత్యనారాయణస్వామి వ్రతం, 15న గంగ తెప్పోత్సవం, సాయంత్రం మల్లికార్జున స్వామి కల్యాణం, 16న సదరుపటం, అగ్గి గుండాల కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి బండారి నారాయణగారి మల్లేశం తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మంత్రి మహమూద్ అలీ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

చార్మినార్: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీలో చేరుతున్నారని హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. చార్మినార్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి ఆధ్వర్యంలో రాజస్థాన్‌కు చెందిన పలువురు ముస్లింలు మంత్రి మహమూద్ అలీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మోడల్ డెవలప్‌మెంట్ ముందు గుజరాత్ డెవలప్‌మెంట్ జీరో అన్నారు. తెలంగాణలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని దేశ వ్యాప్తంగా అమలు చేయడానికి సీఎం కేసీఆర్ పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన షాదాబ్ లోహర్, మోహసిన్ ఖాన్, హాజీ రాయీస్, మహ్మద్ సిరాజ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారని మహ్మద్ సలావుద్దీన్ లోధి తెలిపారు.

నుమాయిష్‌లో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



నుమాయిష్‌లో నగర సీపీ సీవీ ఆనంద్ తదితరులు

ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించిన సీపీ సీవీ ఆనంద్

గన్‌ఫౌండ్రీ: నగర ప్రజలకు నుమాయిష్‌తో ప్రత్యేకమైన అనుబంధం ఉంటుందని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో ట్రాఫిక్ పోలీస్ స్టాల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేదుకు ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ ముగిసేలోపు లక్ష మందికి పైగా సందర్శకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. నగరం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం సందర్శకులు ఇక్కడకు వస్తారన్నారు. అనంతరం సందర్శకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ అడిషనల్ సీపీ సుధీర్‌బాబు, లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్, సిట్ అడిషనల్ సీపీ ఏఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

నాంపల్లి: యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ), పోశర్ల సంస్థ సంయుక్త నిర్వహణలో బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభించారు. తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, కళాశాల విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, పోశర్ల లిమిటెడ్ సీఎండీ గౌతమ్‌చంద్ జైన్ అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ మాజీ అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి, సీఈఓ ఖ్యాతి నరవణే పాల్గొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రారంభించనున్నట్లు అనిల్ అగర్వాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ వివిధ సంస్థలతో నాలుగు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసుకున్నట్లు తెలిపారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జయేష్‌రంజన్, చిత్రంలో నవీన్ మిట్టల్, అనిల్ అగర్వాల్

డాక్టరేట్ ప్రదానం



ఐజాజ్ సుల్తానా

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్న ఐజాజ్ సుల్తానాకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. "మత ఘర్షణలు–స్త్రీలు: హైదరాబాద్ పాతబస్తీ 1990–2010" అనే అంశంపై ఆచార్య లక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు విశ్వ విద్యాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్ ఐజాజ్‌ను అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని హరిజన బస్తీలో బుధవారం ఆమె నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని హరిజన బస్తీలో ప్రజల సూచనల మేరకు రూ.4 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు దొంకి యాదగిరి, జి.పి.సురేశ్‌కుమార్, జి.ఎం.జ్యోతికుమార్, దయానంద్, బాబు, నర్సింగ్, నితీష్, వార్డు కమిటీ సభ్యులు ఇ.సుమన్‌కుమార్‌ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, జి.రఘుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌గా శాంతికుమారి నియామకంపై హర్షం



సోమయ్య

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎ.శాంతికుమారిని నియమించడం పట్ల తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాగంటి సోమయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం నాంపల్లిలో సంఘం రాష్ట్ర నాయకులు హసన్, రహమతుల్లా, శంకర్, పి.బెన్సన్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారి ఓ మహిళ సీఎస్‌గా నియమితులు కావడాన్ని స్వాగతించారు. సుదీర్ఘ అనుభవం కలిగిన శాంతికుమారిని సీఎస్‌గా నియమించిన సీఎం కేసీఆర్‌కు సోమయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి, సీఎం కేసీఆర్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజల వెంటే మజ్లిస్ పార్టీ

ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌ల నుంచి సోమవారం పలువురు టోలిచౌకిలోని ఆయన కార్యాలయానికి వచ్చి వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. బస్తీలు, కాలనీలలో డ్రైనేజీ, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఉన్నతాధికారులతో మాట్లాడి మరిన్ని నిధులు సాధిస్తానని చెప్పారు. కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మజ్లిస్ పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎంతగానో సహకరిస్తున్నారని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాలల ఏర్పాటుకు ఎంపీ నిధులు కేటాయించారన్నారు. డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మార్చడానికి రూ.300 కోట్లతో పనులు జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

గోల్కొండ: కార్వాన్ పద్మశాలి సంఘం, యువజన పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్ పరిసర ప్రాంతాల మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అంబటి సంతోష్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ మహిళల పండుగ అన్నారు. పోటాపోటీగా యువతులు ఇళ్ల వాకిళ్లను ఆకట్టుకునే రంగులతో అలంకరిస్తారన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హరిదాసు, చెన్న చంద్రయ్య, కట్ల అశోక్, మహిళా సంఘం అధ్యక్షురాలు కోకుంట్ల కల్పన, సాయితేజ, మౌనిక పాల్గొన్నారు.

నాంపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జవహర్ బాలభవన్‌లో విద్యార్థులకు రంగోలీ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జంటనగరాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని రంగు రంగుల ముగ్గులు, చిత్రాలను ఆవిష్కరించారు. బాలభవన్ డైరెక్టర్ ఉషారాణి చిన్నారులను అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

అబిడ్స్: బేగంబజార్ ఫీల్‌ఖానాలోని ఆంధ్ర సరస్వతి బాలికల పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇండియన్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు చేపట్టారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థినులు పాల్గొన్నారు. రాష్ట్ర బీజేపీ మహిళా నాయకురాలు, మార్గదర్శిని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని ముగ్గుల పోటీలను పర్యవేక్షించారు.



ఆంధ్ర సరస్వతి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



బాలభవన్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఎమ్మెల్యే మైనంపల్లి జన్మదిన వేడుకలు

అబిడ్స్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జన్మదిన వేడుకలను గోషామహల్ నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి



గౌలిపురా: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఊరు వెళ్లే ముందు పేపర్, పాల ప్యాకెట్ వాళ్లను రావొద్దని చెప్పాలన్నారు. ఇంట్లో విలువైన వస్తువులను పెట్టకుండా లాకర్లలో పెట్టుకోవాలన్నారు. ఇంటి ఆవరణ, హాల్‌లో లైట్ వెలిగేలా చూసుకోవాలన్నారు. మీ పక్కింటి వారికి గమనిస్తుండమని చెప్పి వెళ్లాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు కాల్ చేయడంతో దొంగతనాలను నివారించవచ్చన్నారు.

సెవన్ టూంబ్స్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

గోల్కొండ: డ్రైనేజీ పనుల నిర్మాణం కారణంగా టోలిచౌకి–సెవన్ టూంబ్స్ రోడ్డుపై తవ్వకాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సెవన్ టూంబ్స్ రోడ్డు జంజం టెక్స్‌టైల్స్ షోరూం ముందు ఈ పనులు జరుగుతున్నాయని, టోలిచౌకి నుంచి సెవన్ టూంబ్స్ చౌరస్తా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. నానల్ నగర్ జంక్షన్ నుంచి సెవన్ టూంబ్స్ రోడ్డు, గోల్కొండ, అల్కాపురి కాలనీ వెళ్లే వారు టోలిచౌకి ఫ్లైఓవర్, షేక్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద సెవన్ టూంబ్స్ జంక్షన్ నుంచి వెళ్లాలి. గోల్కొండ అల్కాపురి వారు బంజార దర్వాజ గుండా టోలిచౌకి చౌరస్తా వెళ్లే వారు షేక్‌పేట్ నాలా నుంచి యూ టర్న్ తీసుకుని టోలిచౌకి ఫ్లైఓవర్‌కు వెళ్లాలి.

నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురికి జైలు

బహదూర్‌పురా: బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసుల్లో నిందితులకు మూడు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.50ల జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ జలాల్‌బాబా నగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (27) ముబారక్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ రియాజ్ (25) సదాఫ్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. యూసుఫ్‌నగర్ టప్పాచబుత్రాకు చెందిన అఫ్రోజ్ ఖాన్ (25) ముఖ్తార్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ ముగ్గురు నిబంధనలను ఉల్లంఘిస్తూ అర్ధరాత్రి దాటిన అనంతరం వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.50ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

విద్యార్థులకు అభినందనలు

గోల్కొండ: శ్రీచైతన్య స్కూల్ మెహిదీపట్నం బ్రాంచ్‌కు చెందిన 177 మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చి రెండో లెవల్ పరీక్షకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఏజీఎం బి.కృష్ణ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి, ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు, కో ఆర్డినేటర్ రవికుమార్, డీన్ ఓంకార్, ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిళల రక్షణకు పటిష్ట చర్యలు



గోల్కొండ: గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షులు ఎస్.రాజు వస్తాద్ బుధవారం షీటీం శిఖాగోయల్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం మహిళల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం ధర్నా

గోల్కొండ: డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం గుడిమల్కాపూర్ నవోదయ కాలనీలోని జిలమండలి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని శివాజీ నగర్‌లో నెల రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతుందని, అధికారులు పట్టించుకోవడం లేదని నాంపల్లి సీపీఎం కార్యదర్శి సి.మల్లేష్ అన్నారు. డ్రైనేజీ నీటి కారణంగా దోమలు విజృంభిస్తున్నాయన్నారు. పూడిక తీయకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని ఆయన అన్నారు. పాత డ్రైనేజీ లైన్లు తొలగించి కొత్తవి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.శంకర్, అంజయ్య, బస్తీవాసులు సుధాకర్, జనార్దన్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

'నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి'

నాంపల్లి: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో కార్మికులు మెరుపు ధర్నా చేపట్టారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వేగి మురళీకృష్ణ, బ్రాంచ్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత కోచింగ్ డిపో నుంచి కార్మికులు భారీ ప్రదర్శనగా హైదరాబాద్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో సంఘ్ నేతలు ఐఎస్‌ఆర్ మూర్తి, నాగరాజు ప్రసాద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కార్మికులు